## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్: చెట్లకొమ్మల తొలగింపు, మరమ్మతు పనుల కారణంగా ఆస్మాన్‌ఘడ్ ట్రాన్స్‌కో డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు డీఈ విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు.

- ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు స్టాండ్లీ స్కూల్, దర్గా ఏ ఉజాలే షా, జీవన్‌జంగ్ కాలనీ, డీ క్వార్టర్స్, పంటయ్య బ్యాండ్, బీబీ కా ఆల్వా, కాలీ మజీద్, కమలేషా దర్గా, జబ్బార్ హోటల్ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.
- మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 4:30 వరకు ఆనంద్‌నగర్, మలక్‌పేట్ ప్రొఫెసర్స్ కాలనీ, హనుమాన్ టెంపుల్, డీ మార్ట్, చర్మాస్, ఏకలవ్య నగర్, సైదాబాద్ మెయిన్‌రోడ్, పూసల బస్తీ, రెడ్డిబస్తీ పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని డీఈ వివరించారు.

## ప్రమాదకరం



మలక్‌పేట: అక్బర్‌బాగ్ డివిజన్ జడ్జెస్ కాలనీలోని హైదరాబాద్ కిడ్నీ సెంటర్ సమీపంలో వాటర్‌వర్క్స్ పైప్‌లైన్ జంక్షన్‌కు ఐరన్‌తో బిగించిన మ్యాన్‌హోల్ కవర్ విరిగిపోయి ప్రమాదకరంగా మారింది. ప్రమాదాలు జరుగకుండా స్థానికులు మూతలేని ప్రాంతంలో చెక్క మొద్దు అడ్డంగా ఉంచారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపించారు. ఇకనైనా అధికారులు సమస్య పరిష్కారించే దిశగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## వరదనీటి కాలువ పనులను పరిశీలించిన కార్పొరేటర్



అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి తదితరులు

వనస్థలిపురం: బీఎన్ రెడ్డినగర్ డివిజన్ పరిధిలో నిర్మించనున్న వరదనీటి కాలువ పనుల పురోగతిని బుధవారం హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి, మున్సిపల్ అధికారులతో కలిసి పరిశీలించారు. కాలువ నిర్మాణం సందర్భంగా వరద నీరు సాఫీగా వెళ్లడానికి తీసుకోవాల్సిన చర్యలను చర్చించారు. వనస్థలిపురం మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్‌రెడ్డి, డీఈ దామోదర్, వర్క్ ఇన్‌స్పెక్టర్ సురేష్, ఆయా కాలనీవాసులు పాల్గొన్నారు.

## సీసీరోడ్డు పనులు ప్రారంభం




పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 30వ డివిజన్‌లో సీసీరోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ భీమిడి స్వప్న జంగారెడ్డి కాలనీవాసులతో కలిసి ప్రారంభించారు. అలా గే5వ డివిజన్‌లోని వినాయకహిల్స్ కాలనీ, రామిడిహిల్స్, 9వ డివిజన్‌లోని గ్రీన్‌హోమ్స్ కాలనీ, బాలాపూర్‌లోని 16, 17 డివిజన్లలోని తదితర కాలనీల్లో మేయర్ చిగురింత పారిజాత స్థానిక కార్పొరేటర్‌లతో కలిసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంసీఆర్ కాలనీ అధ్యక్షుడు అరుణ్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి నర్సింగ్ నాయక్, కోశాధికారి దివ్య వేణుగోపాల్, యూత్ ప్రెసిడెంట్ వివేక్, మాజీ అధ్యక్షుడు సురేష్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## శ్రీవారి హుండీ లెక్కింపు

మీర్‌పేట: జిల్లెలగూడ శ్రీ మత్స్యావతార వేంకటేశ్వర స్వామి దేవాలయ హుండీని బుధవారం ఆలయ కార్యనిర్వహణ అధికారి వై.శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో లెక్కించారు. 12 డిసెంబరు 2024 నుంచి జనవరి 22 వరకు ఆదాయం రూ.2 లక్షల 91 వేల 356 ఆదాయం వచ్చిందని ఈఓ తెలిపారు. లెక్కింపు కార్యక్రమంలో కార్పొరేటర్ రాజేందర్‌రెడ్డి, మాజీ ధర్మకర్తలు యాదగిరి ముదిరాజ్, జ్ఞానేశ్వరచారి, దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్, అర్చకులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



హుండీని లెక్కిస్తున్న సిబ్బంది

# క్రీడా పోటీలతో పోలీసుల్లో సమష్టితత్వం

- పోలీసు ఉద్యోగం సవాళ్లతో కూడుకున్నది
- రాష్ట్ర ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్‌రెడ్డి
- ముగిసిన రాచకొండ కమిషనరేట్ వార్షిక స్పోర్ట్స్ మీట్



విజేతలకు ట్రోఫీని అందజేస్తున్న శివధర్‌రెడ్డి తదితరులు

హుడాకాంప్లెక్స్: పోలీసు ఉద్యోగం ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని తమ కర్తవ్య నిర్వహణలో భాగంగా రేయింబవళ్లు పనిచేయాల్సి ఉంటుందని, క్రీడలు వ్యక్తుల మానసిక శారీరక ఉల్లాసానికి ఎంతగానో ఉపయోగపడతాయని తెలంగాణ రాష్ట ఇంటెలిజెన్స్ డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. ఈ క్రీడా పోటీల నిర్వహణతో పోలీసులు రెట్టించిన ఉత్సాహంతో పనిచేసే అవకాశం ఉందన్నారు. సరూర్‌నగర్ స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగిన ఆరవ ఎడిషన్ రాచకొండ పోలీస్ కమిషనరేట్ వార్షిక స్పోర్ట్స్ మీట్–2025 క్రీడా పోటీలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన శివధర్‌రెడ్డి మాట్లాడుతూ... పోలీసులు స్వతహా సిద్ధంగా చక్కటి ఫిట్ నెస్ తో క్రీడా సామర్థ్యం కలిగి ఉంటారని, 1956 జాతీయ ఫుట్ బాల్ జట్టులో ముగ్గురు హైదరాబాద్ పోలీసు అధికారులు ఉండటం మనకు గర్వకారణమని ఆయన గుర్తు చేశారు. విధి నిర్వహణలో బిజీగా ఉన్నా వారానికి కనీసం మూడు గంటల పాటు క్రీడలకు సమయం కేటాయించాలని సూచించారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ శాంతిభద్రతల నిర్వహణ, నేర నియంత్రణలో జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో ఉందని మరింత అంకిత భావంతో పని చేస్తూ ఆ మంచిపేరును కొనసాగించాలని సూచించారు.

- రాచకొండ కమిషనర్ శ్రీ సుధీర్‌బాబు మాట్లాడుతూ... మూడు రోజులపాటు సాగిన స్పోర్ట్స్ మీట్‌లో పాల్గొన్న అన్ని జట్లను, విజేతలను అభినందించారు. విధి నిర్వహణలో భాగంగా ఎన్నో రకాల ఒత్తిళ్లను ఎదుర్కొంటూ సమర్థవంతంగా శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తున్న పోలీసులకు మానసికోల్లాసాన్ని అందించే లక్ష్యంతో ఈ రాచకొండ పోలీస్ స్పోర్ట్స్ మీట్ నిర్వహించామన్నారు. రాచకొండ అన్ని జోన్లు, వివిధ పోలీసు విభాగాల నుంచి 25 క్రీడా విభాగాల్లో మొత్తం ఎనిమిది జట్లు, 1000 మంది పోలీసు క్రీడాకారులు క్రికెట్, వాలీబాల్, ఫుట్ బాల్, రన్నింగ్, చెస్, బ్యాడ్మింటన్ వంటి పలు రకాల ఇండోర్, ఔట్ డోర్ క్రీడా పోటీలలో పాల్గొన్నారని తెలిపారు. శాంతిభద్రతల నిర్వహణలో సిబ్బందికి నాయకత్వం వహించడంతోపాటు వారి సంక్షేమానికి కూడా అధిక ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. డీసీపీలు రాజేష్ చంద్ర, ప్రవీణ్ కుమార్, పద్మజ, అరవింద్ బాబు, సునీతారెడ్డి, రమణారెడ్డి, మురళీధర్, శ్రీనివాస్, ఇందిర, నాగలక్ష్మి, ఉషా విశ్వనాథ్, పలువురు అదనపు డీసీపీలు, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## హాల్ టికెట్ల కోసం ఇంజినీరింగ్ విద్యార్థుల ఆందోళన



కాలేజ్ ఆవరణలో తల్లిదండ్రులతో ఇంజినీరింగ్ విద్యార్థులు

మలక్‌పేట: హాల్ టికెట్లు ఇవ్వాలని సుమారు పది మంది ఇంజినీరింగ్ ఫస్ట్ ఇయర్ విద్యార్థులు ముంతాజ్ కాలేజ్ వద్ద తల్లిదండ్రులతో కలిసి ఆందోళన చేశారు. హాల్ టికెట్ ఇవ్వని కారణంగా బుధవారం రాయాల్సిన మొదటి సెమిస్టర్ పరీక్షకు హాజరు కాలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ పిల్లలకు అడ్మిషన్లు ఉన్నాయా... లేవా అంటూ తల్లిదండ్రులు కళాశాల నిర్వాహకులను ప్రశ్నించారు. జేఎన్‌టీయూ టెక్నికల్ ప్రాబ్లమ్ కారణంగానే హాల్ టికెట్‌లు ఇష్యూ కాలేదని నిర్వాహకులు చెప్పారని, సాయంత్రం 5 గంటల తరువాత హాల్ టికెట్లు ఇచ్చారని తల్లిదండ్రులు పేర్కొన్నారు. దీంతో పిల్లలకు ఒక సబ్జెక్టు బ్యాక్‌లాగ్ అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటన పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

## ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోవాలి



ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్: రోడ్డు ప్రమాదాలను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యత అని.. విద్యార్థులు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కలిగి ఉండాలని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని బుధవారం హయత్‌నగర్ జిల్లాపరిషత్ పాఠశాలలో జరిగిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థి దశ నుంచే రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని అన్నారు. ద్విచక్ర వాహనాలు నడిపేవారు తప్పకుండా హెల్మెట్‌ను ధరించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల నుంచి జాతీయ రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాఠశాల, ప్రధానోపాధ్యాయులు ఇందిరా ఇర్‌టీఓ అధికారి అనూషా తదితరులు పాల్గొన్నారు.

## 31లోగా ట్రేడ్ లైసెన్స్‌లను పునరుద్ధరించుకోవాలి



మటన్ షాపు నిర్వాహకుడికి చలానా అందజేస్తున్న డాక్టర్ శ్రీకాంత్

మలక్‌పేట: జీహెచ్‌ఎంసీ సౌత్‌జోన్ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో బుధవారం మలక్‌పేటలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. పలు ప్రాంతాలలో మటన్, చికెన్ షాపులలో తనిఖీలు చేశారు. ట్రేడ్ లైసెన్స్ దుకాణాలలో ఉన్న మాంసాన్ని, చికెన్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 31 తేదీలోగా చికెన్, మటన్ దుకాణాల నిర్వాహకులు తమ ట్రేడ్ లైసెన్స్‌లను పునరుద్ధరించుకోవాలని సూచించారు. లేనిపక్షంలో జరిమానా విధించనున్నట్లు ఆయన హెచ్చరించారు. జీహెచ్‌ఎంసీ చట్టం 1955 ప్రకారం ట్రేడ్ లైసెన్స్‌లేని దుకాణ యాజమానులను ప్రాసిక్యూట్ చేసి రూ. 1500 జరిమానా విధించినట్లు తెలిపారు. స్టాంప్‌లేని మాంసం, నల్ల కవర్లు జప్తు చేశామన్నారు. ఫ్రిజ్‌లలో మాంసం, చికెన్ నిల్వ చేసి విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

## మహిళలు ఆర్థిక పురోగతి సాధించాలి

- కార్పొరేటర్ కొత్తకాపు అరుణ



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న కార్పొరేటర్ అరుణ

సైదాబాద్: మహిళలు ఆర్థిక ప్రగతి సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సైదాబాద్ డివిజన్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని నైపుణ్య శిక్షణ–అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సైదాబాద్ కేంద్రంలో మహిళలకు కుట్టు, బ్యుటీషియన్, జ్యూట్ బ్యాగుల తయారీ తదితర కోర్సులలో ఉచిత శిక్షణ ఇస్తుండటం అభినందనీయమని కార్పొరేటర్ తెలిపారు. బుధవారం సైదాబాద్‌లోని ఉచిత శిక్షణ కేంద్రాన్ని కార్పొరేటర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ అంశాల్లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు ఆమె సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం అరుణ మాట్లాడుతూ... శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు వారి వృత్తి నైపుణ్యాలను తమ కుటుంబ ఆర్థిక పురోభివృద్ధికి ఉపయోగించుకోవాలని సూచించారు. మహిళలు ఈ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ కోరారు. ప్రాజెక్ట్ ఆఫీసర్ మాల కొండయ్య, ట్రైనర్లు గీత, శశికళ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు భరోసా కల్పించేందుకే ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్న ఏసీపీ శ్యాంసుందర్, ఇన్‌స్పెక్టర్ నరేష్

- మలక్‌పేట ఏసీపీ శ్యామ్‌సుందర్

మలక్‌పేట: శాంతిభద్రతల విషయంలో ప్రజలకు భరోసా, నమ్మకాన్ని కల్పించడానికి ఫ్లాగ్‌మార్చ్ చేపట్టినట్లు మలక్‌పేట ఏసీపీ శ్యామ్‌సుందర్ అన్నారు. నగర పోలీస్ కమిషనర్, సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ ఆదేశాల మేరకు బుధవారం రాపిడ్ యాక్షన్ బలగాలు, స్థానిక పోలీసులు అస్మాన్‌ఘడ్ బీ–బ్లాక్, సలీంనగర్, మూసారంబాగ్, దిల్‌సుఖ్‌నగర్, గడ్డిఅన్నారం ప్రాంతాలలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మలక్‌పేట ఇన్‌స్పెక్టర్ పిడమర్తి నరేష్ మాట్లాడుతూ... శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ రాజు, ఎస్ఐలు సంజీవరెడ్డి, నవీన్, సురేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## 'ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి'



జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్‌పాటిలో కలిసి పరిశీలిస్తున్న కార్పొరేటర్ సుజాతనాయక్

హస్తినాపురం: డివిజన్ పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యల పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తానని, హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతనాయక్ అన్నారు. ఏపీఎస్ ఈబీ కాలనీ నుండి బైరామల్‌గూడ చెరువు వరకు వరదనీటి కాలువ నిర్మాణానికి 12.5కోట్ల రూపాయలు మంజూరు చేయించినట్లు బుధవారం కార్పొరేటర్ తెలిపారు. ఈ పనులు పూర్తి అయితే హస్తినాపురం డివిజన్ లో దాదాపు వరదనీటి సమస్య పరిష్కారమవుతుందన్నారు. అలాగే రెడ్డి కాలనీ, కేకేగార్డెన్ వందనపురి కాలనీ వెనుకబాగం వరకు వరదనీటి కాలువ నిర్మాణానికి కూడా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పనుల పరిశీలన సందర్భంగా జోనల్ కమీషనర్ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో అధికారులు ఇస్లావత్ నాయక్, వెంకటకిరన్‌రెడ్డి, కార్తిక్, మల్లికార్జున్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పార్కు స్థలాన్ని కాపాడండి

హస్తినాపురం: ప్రజల అవసరాలకోసం ఏర్పాటు చేసిన పార్కు స్థలాలు కబ్జా అవుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని హస్తినాపురం నార్త్ ఎక్స్ టెన్షన్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వి.చంద్రశేఖర్‌యాదవ్ వాపోయారు. బుధవారం కాలనీలో ఉన్న 1.27 ఎకరాల పార్కు స్థలం కబ్జా అయిందని, దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని కోరుతూ హైడ్రా అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీ ప్రజల అవసరాలకు ఏర్పాటు చేసిన పార్కు స్థలాన్ని కబ్జాచేసి పార్కులోకి రాకుండా చేస్తున్నారన్నారు.సమగ్ర విచారణ జరిపించి రూ. 55 కోట్ల విలువైన పార్కును కబ్జాదారుల నుండి రక్షించి కాలనీవాసులకు న్యాయం చేయాలని కోరారు.

## సీపీఎం మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

ఉప్పల్: 25 నుంచి సంగారెడ్డిలో నిర్వహించే సీపీఎం రాష్ట మహాసభలను జయప్రదం చేయాలని ఉప్పల్ కార్యదర్శి వెంకన్న అన్నారు. బుధవారం మహాసభల పోస్టర్‌ను సీపీఎం నేతలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. వెంకన్న మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రజా సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఆరోపించారు. పాలనపై అన్ని వర్గాల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని అభిప్రాయపడ్డారు. మహిళ నేత వినోద, నాగరాజు, ఉర్మిళ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి నిధులు కేటాయించండి: బీజేపీ



మాట్లాడుతున్న బీజేపీ నేత వేణు

దిల్‌సుఖ్‌నగర్: హైదరాబాద్ మహా నగరాన్ని ఇస్తాంబుల్, డల్లాస్ నగరాలుగా చేస్తామని కాంగ్రెస్ పాలకులు ప్రగల్భాలు పలుకుతున్నారని, జీహెచ్‌ఎంసీ పరిధిలో వీధి దీపాలు పాడైతే మరమ్మతు చేసే నాథుడే లేడని ఓబీసీ మోర్చా తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి, మీడియా ఇంచార్జ్ బి.బి.ఆర్.వేణు అన్నారు. బుధవారం ఆర్‌కేపురం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోని జీహెచ్‌ఎంసీ ప్రాంతాలలో వీధి లైట్లు వెలగడం లేదని అన్నారు. ఇదే విషయాన్ని అధికారులను అడిగితే ఈఈఎస్‌ఎల్ అనే ఏజెన్సీ మెయింటెనెన్స్ చేస్తున్నది అని వారికి బిల్లులు ఆపేయడంతో మూడు నెలల నుంచి ఈ ఏజెన్సీ ఎక్కడా వీధిలైట్లకు మరమ్మతులు చేయడం లేదన్నారు. తక్షణమే వీధి దీపాలు, ఇతరత్రా అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయాలన్నారు. బస్తీలు, కాలనీల్లో వీధి దీపాలు వెలగక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బీజేపీ నాయకులు వెంకటేష్ గుప్తా, రాజు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా నల్లబెల్లం తరలిస్తున్న నలుగురి అరెస్ట్



మాట్లాడుతున్న కిషన్

దిల్‌సుఖ్‌నగర్: కర్ణాటక నుండి హైదరాబాద్ అక్రమంగా నల్లబెల్లం, పటికను తరలిస్తున్న నలుగురిని సరూర్ నగర్ ఎక్సైజ్ పోలీసులు, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు అరెస్టు చేసి 7వేల కేజీలకు పైగా నల్ల బెల్లం, 40 కేజీ ల పటికను స్వాధీనం చేసుకున్నారు. బుధవారం సరూర్ నగర్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారి కిషన్ మాట్లాడుతూ తెలంగాణలో సారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలని ఎక్సైజ్ కమిషనర్ కమలహాసన్ రెడ్డి ఆదేశాల మేరకు దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పహాడి షరీఫ్‌లో కర్ణాటక నుండి డీసీఎంలో తీసుకువచ్చి రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు అక్రమంగా నల్లబెల్లం, పటిక తరలిస్తున్నారని సమాచారంతో సరూర్‌నగర్ ఎక్సైజ్ పోలీసులు, ఎక్సైజ్ ఎన్ఫోర్స్మెంట్ అధికారులు దాడులు నిర్వహించి స్వాధీనం చేసుకున్నారన్నారు. శివకాంత్, కేతావత్ అరుణ్ నాయక్, సభవాత్ హీర్యా సింగ్, మహమ్మద్ బాబాలను అరెస్టు చేశారు.రామవాత్ నరేష్, కేతావత్ శ్రీను నాయక్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.



## అలకనంద ఆస్పత్రిని మూసివేయాలి

### వైద్యులు, యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టాలి: ఏఐవైఎఫ్



ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

హుడాకాంప్లెక్స్: నిబంధనలకు విరుద్ధంగా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లకు పాల్పడిన సరూర్‌నగర్ డాక్టర్స్ కాలనీలోని అలకనంద మల్టీస్పెషాలిటీ ఆస్పత్రి వైద్యులు, యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా సమితి నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఆస్పత్రి వద్ద నిర్వహించిన ధర్నాలో ఏఐవైఎఫ్ రాష్ట కార్యదర్శి కె.ధర్మేంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌లు మాట్లాడుతూ.. ఆస్పత్రి యాజమాన్యం 9 పడకలకు అనుమతి పొంది, 30 పడకలను అక్రమంగా నిర్వహిస్తున్నా వైద్య ఆరోగ్య శాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు జరిగితే కాని స్పందించరా అని ప్రశ్నించారు. ఈ హాస్పిటల్‌ను సీజ్ చేయడంతో పాటు, ప్రత్యేక విభాగాన్ని నియమించి రాష్ట్రంలోని ప్రైవేటు ఆస్పత్రులను సోదాచేయాలని కోరారు. ఏఐవైఎఫ్ రాష్ట ఉపాధ్యక్షుడు టి.సత్యప్రసాద్, రాష్ట కార్యవర్గ సభ్యుడు ఆర్.బాలకృష్ణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శి మధు, పి.శివకుమార్, సహాయ కార్యదర్శి వీరేష్, వెంకటేశ్, సందీప్ పాల్గొన్నారు.

## ప్రభుత్వ పథకాలపై ప్రశ్నించండి

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మల్కాజిగిరి: ప్రభుత్వ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఎలాంటి ఇబ్బంది కలిగించినా, వారి పేర్లు జాబితాలో లేకపోయినా అధికారులను నిలదీయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి సూచించారు. బుధవారం క్యాంప్ కార్యాలయంలో పార్టీ కార్పొరేటర్లు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు, రేషన్‌కార్డుల జారీపై ప్రజలను ఆందోళనకు గురిచేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇంటి జాబితాలో అర్హుల పేర్లు లేవని ఈ విషయాన్ని వార్డు సభలో గట్టిగా నిలదీయాలని సూచించారు. అధికారులు పారదర్శకంగా పనిచేయకపోతే సీఎం దృష్టికి తీసుకెళ్తానని స్పష్టం చేశారు. కార్పొరేటర్లు విజయశాంతిరెడ్డి, మురుగేష్ నాయకులు పాల్గొన్నారు.

## బీజేపీ ఐఎస్‌సదన్ అధ్యక్షుడిగా గిరిధర్‌రెడ్డి

సైదాబాద్: బీజేపీ ఐఎస్‌సదన్ అధ్యక్షుడిగా పార్టీ సీనియర్ నాయకుడు గిరిధర్ రెడ్డి రెండవ సారి నియామితులయ్యారు. ఈ సందర్భంగా బుధవారం డివిజన్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గిరిధర్‌రెడ్డిని కార్పొరేటర్ జంగం శ్వేత మధుకర్‌రెడ్డి, బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డివిజన్ పరిధిలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సమన్వయం చేసుకుంటూ పార్టీ పటిష్టతకు కృషి చేస్తానన్నారు. ఎప్పుడు జీహెచ్‌ఎంసీ ఎన్నికలు వచ్చినా ఐఎస్‌సదన్ డివిజన్‌లో వరుసగా రెండవ సారి బీజేపీ గెలుపు కోసం పాటుపడుతానని అన్నారు.

## కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో... రూపాయల్లో).. టమాట 10, వంకాయ 35, బెండ 45, పచ్చి మిర్చి 45, కాకర 32, బీర 40, క్యాబేజి 13, ఫ్రెంచిబీన్స్ 40, క్యారెట్ 23, దొండ 35, చిక్కుడు 45, గోకర 28, బీట్‌రూట్ 18, క్యాప్సికం 35, ఆలుగడ్డ 27, దోస 18, సొరకాయ 11, పొట్లకాయ 18, ఉల్లిగడ్డ 32, చామగడ్డ 40. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.